సాక్షి
వికారాబాద్

సోమవారం ǀ 17 ǀ మార్చి ǀ 2025




ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలర్చుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. 8లో▸



ఆరాధనోత్సవాలు

కొడంగల్ పట్టణంలోని శ్రీనిరంజన మఠంలో ఆదివారం వీరశైవ సమాజం భక్తులు స్వామివారికి పూజలు చేశారు. 8లో▸



న్యూస్‌రీల్

ఇఫ్తార్ విందులో స్పీకర్



తన్వర్‌అలీకి ఖర్జూర తినిపిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి ఫంక్షన్ హాలులో వ్యాపారవేత్త తన్వర్‌అలీ ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రంజాన్ ఉపవాసాల సందర్భంగా స్పీకర్ ముస్లిం సోదరులకు ఖర్జూరాలు తినిపించి దీక్షను విరమింపజేశారు. ప్రతి ఒక్కరూ ఆహ్లాద వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు.

26న వాహనాల వేలం

ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేరుకుపోయిన 148 గుర్తు తెలియని వాహనాలను ఈ నెల 26న వేలం వేయనున్నట్లు ఆదివారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కేంద్రంలో భద్రపర్చిన ఈ వాహనాలను పోలీస్ చట్టం 1861లోని సెక్షన్ 26 ప్రకారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఏదైన వాహనంపై ఎవరికైన అభ్యంతరం, యాజమాన్య హక్కులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం వాహనాల వేలం కమిటీ చైర్మన్, జిల్లా అదనపు ఎస్పీ టీవీ హన్మంత్‌రావును ఫోన్‌లో 87126 70012 సంప్రదించాలని వివరించారు.

రక్త మైసమ్మ సేవలో మండలి చీఫ్ విప్



జాతరలో విద్యార్థినులతో మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం మారెపల్లి గేటు వద్ద ఉన్న రక్త మైసమ్మ జాతరలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాల విద్యార్థినులతో కలిసి అయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శాలువతో మహేందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ శివారులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలోని క్వారీలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఫిర్యానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల క్వారీలో చిరుతపులి పిల్ల సంచారిస్తోందన్న ప్రచారంపై ఆయన స్పందించారు. మల్కాపూర్‌తో పాటు సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. చిరుతపులి పిల్ల కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బెల్కటూర్ సమీపంలో కూడా ఎలుగుబంటి సంచరిస్తోందన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సేవా వైభవ రత్న అవార్డు



కొడంగల్: కొడంగల్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తాకు సేవా వైభవ రత్న అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని సర్ సీవీ రామన్ అకాడమి(సేవా సాంస్కృతిక సంస్థ) రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం అవార్డును అందజేశారు. ఉగాది మహోత్సవ సువర్ణ ఘంటా కంకణ గోల్డ్ మెడల్స్ అవార్డుల సంబరాల సందర్భంగా హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో సేవా వైభవ రత్న అవార్డును సీవీ రామన్ అకాడమి అధ్యక్షుడు డా.విజయ్‌కుమార్, చాముండేశ్వర మహర్షి, వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. శివకుమార్ గుప్తా ప్రస్తుతం పీఏసీఎస్ చైర్మన్‌గా, ఆర్యవైశ్య సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. లయన్స్‌క్లబ్, బాధ్యత సేవా సంస్థల్లో ప్రతినిధిగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

నేటి నుంచి లెప్రసీ సర్వే

- ఏఎన్‌ఎం, మెడికల్ ఆఫీసర్ల పర్యవేక్షణ
- ఈ నెలాఖరు వరకు వివరాల సేకరణ
- అన్ని ఏర్పాట్లు చేసిన వైద్య అధికారులు



వికారాబాద్: లెప్రసీ(కుష్టు) వ్యాధిని ముందుగా గుర్తించి, సరైన వైద్యం అందించడానికి వీలుగా సోమవారం నుంచి వైద్య ఆరోగ్య అధికారులు సర్వే చేపట్టనున్నారు. ఈ నెల 17వ తేదీన సర్వే ప్రారంభించి 31న ముగియనుంది. ఈ సర్వే కోసం ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలను వినియోగించనున్నారు. రెండు నెలల క్రితమే జిల్లాలో సర్వే నిర్వహించగా అప్పుడు ఆశవర్కర్లు సమ్మెలో ఉండటంతో అసంపూర్తిగా మూలన పడింది. దీంతో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించేందుకు అధికారులు మళ్లీ ప్రణాళిక రచించారు. దీన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేసి లెప్రసీ గణాంకాలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. సర్వే ఎలా చేయాలి.. ఎండల దృష్ట్యా ఏ సమయంలో చేయాలి..? రోజుకు ఎన్ని కుటుంబాలు చేయాలనే విషయంలో జిల్లా లెప్రసీ నివారణ అధికారి రవీందర్‌యాదవ్ పర్యవేక్షణలో ఆశ వర్కర్లతో పాటు ఏఎన్‌ఎంలకు శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించారు.



లెప్రసీ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

తగ్గిన బాధితులు

జిల్లాలో గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం 76 మంది లెప్రసీ రోగులు ఉన్నారు. దశాబ్దం క్రితం వరకు కుష్టు వ్యాధిగ్రస్తులు వేల సంఖ్యలో ఉండేవారు. ప్రభుత్వం తీసుకున్న విధానాల వల్ల గణనీయంగా రోగుల సంఖ్య పడిపోయింది. అయితే ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో జిల్లా వైద్య శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి సర్వే ప్రారంభమై 14 రోజుల పాటు కొనసాగుతోంది. సర్వే సమగ్రంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒక్కొక్కరికి 25 ఇళ్లు

జిల్లా వివరాలు	
కుటుంబాల సంఖ్య	2.6 లక్షలు
ఆశవర్కర్లు	720
లెప్రసీ బాధితులు	76

జిల్లాలో మొత్తం 2.6 లక్షల కుటుంబాలు ఉండగా 10 లక్షల పైచిలుకు జనాభా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం 720 మంది ఆశ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు రోజుకు 25 ఇళ్లను సందర్శించి సర్వే చేసేలా ప్లాన్ చేశారు. సర్వేను సూపర్ వైజింగ్ చేయించేందుకు ఐదుగురు ఆశ వర్కర్లకు ఒకరు చొప్పున ఏఎన్‌ఎంలను నియమించారు. మొత్తంగా మండల మెడికల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. జిల్లా స్థాయిలో జిల్లా లెప్రసీ అధికారి సర్వేను రోజువారీగా పరిశీలిస్తారు. వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉదయం 7 గంటలకే సర్వే ప్రారంభించి 9 వరకు రోజూ రెండు గంటల పాటు నిర్వహిస్తారు. ప్రభుత్వం ఇప్పటికే సర్వే కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయగా సర్వేలో పాల్గొన్న వారికి అదనపు పారితోషికం ఇవ్వనున్నారు.

సర్వేకు సహకరించాలి

సర్వేలో ప్రధానంగా శరీర భాగాలపై ఉండే తెల్ల, నల్ల మచ్చలతో పాటు ఇతర రకాల చారలు ఉన్నవారిని గుర్తిస్తారు. మచ్చలు ఉన్న చోట స్పర్శ లేకపోవటం లాంటి లక్షణాల ద్వారా లెప్రసీ రోగులను నిర్ధారిస్తారు. వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి వివరాలు అందజేస్తారు. రోగ నిర్ధారణ తరువాత వారికి పూర్తి స్థాయిలో ప్రభుత్వమే చికిత్స చేయిస్తుంది. ఈ క్రమంలో రోగులను గుర్తించటమే ప్రధాన అంశం. అందుకే సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఇంటికి వచ్చిన ఆరోగ్య సిబ్బందికి అవసరమైన వివరాలు అందజేయాలి.



– డాక్టర్ రవీందర్ యాదవ్, జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి

పాలన.. పరేషాన్!

- పంచాయతీల్లో 'ప్రత్యేక' ఇబ్బందులు
- గ్రామాలకు ఇలా వచ్చి అలా వెళ్తున్న అధికారులు
- భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే



పాలేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పరిగి: గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేక ఆఫీసర్లుగా నియమించి పాలన బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో 566 గ్రామ పంచాయితీలున్నాయి. అయితే నియామకమైన గెజిటెడ్ స్థాయి అధికారులు తమ మాతృశాఖతో పాటు అదనంగా అప్పగించిన రెండు, మూడు గ్రామాల ప్రత్యేక అధికార బాధ్యతలను కార్యదర్శుల భాగస్వామ్యంతో నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో అమలు చేయడం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడం వంటి బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించారు. కానీ ఆయారాం.. గయారాం అన్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. ప్రత్యేకాధికారులు మాతృ శాఖపైనే దృష్టి కేంద్రీకరించి గ్రామాలను పట్టించుకోవడం లేదనే విమర్శ స్థానికంగా వ్యక్తం అవుతోంది.

సవాళ్లుగా మారిన పాలన

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సవాల్‌గా మారింది. సర్పంచ్‌లకు ఉండే బాధ్యతలు ప్రత్యేక అధికారులకు ఉన్నాయి. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీఓ మండల ప్రత్యేక అధికారులు కలసి ప్రతి 15 రోజులకు లేదా నెల రోజులకు ఒకసారి గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ గ్రామ సభలు ఎక్కడా నిర్వహించిన పాపాన పోలేదు. ఇంటి పన్నులు వసూళ్లు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి. ప్రత్యేక అధికారులు వారి శాఖల బాధ్యతలు చూస్తూ పంచాయతీలపై శ్రద్ధ వహించాలి. కానీ అటు మాతృశాఖకు, ఇటు పంచాయతీ బాధ్యతలు సక్రమంగా చూడలేకపోతున్నామని ప్రత్యేక అధికారులు మదన పడుతున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో రోజు రోజుకు సమస్యలు పెరిగి కుప్పలుగా మారుతున్నాయి. గతంలో గ్రామంలో ఏ సమస్యలు ఉన్న సర్పంచ్ దృష్టికి తీసుకెళ్తే వాటిని పరిష్కరించే వారు. కానీ ప్రత్యేక అధికారులు ఎవరో గ్రామస్తులకు తెలియక సమస్యలు పరిష్కారం కావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో నీటి సమస్యలు తెలుత్తుతున్నాయి. ఈ సమయంలో కచ్చితంగా ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ స్పష్టం చేశారు. వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని రకాల పరీక్ష ఫలితాలను నిలుపుదల చేయా లని డిమాండ్ చేస్తూ పట్టణంలో చేపట్టిన దీక్షలు ఆదివారం ఏడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై గత ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించారని, ఈ మేరకు ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు వర్గీకరణ వర్తింజేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. అసెంబ్లీలో ఈనెల 18న చట్టం చేస్తామని చెబుతూనే మరోవైపు ఉద్యోగ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, చెన్నగళ్ల శ్రావణ్, పాండు, యాదగిరి, జోగు శ్రీశైలం, శ్రీను, హరీష్, వినోద్, మధు, శివశంకర్, రాజు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌లో పడి పంచాయతీ కార్మికుడి మృతి

- ఆ నీటిని తాగామని గ్రామస్తుల భయాందోళన
- కరన్‌కోట్‌లో ఘటన



లక్ష్మప్ప (ఫైల్)

తాండూరు రూరల్: ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్‌లో పడి ఓ పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మప్ప(42) ఏడేళ్ల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నారు. అప్పుడప్పుడు ఆయన వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి.. రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఆదివారం ఉదయం గ్రామంలోని పంచాయతీకి చెందిన బంగారమ్మ తాగునీటి ట్యాంక్‌పైన లక్ష్మప్ప బట్టలు కనిపించాయి. వెంటనే వెళ్లి చూడగా వాటర్ ట్యాంక్‌లో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అప్పటికే లక్ష్మప్ప మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదవశాత్తు ట్యాంకులో పడి మృతి చెందాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఓ కూతురు ఉంది.

శుభ్రం చేయించాం

కరన్‌కోట్ గ్రామంలోని బంగారమ్మ గుడి వద్ద ఉన్న తాగునీటి వాటర్ ట్యాంక్ 60 వేల నీటి సామర్థ్యం కలదని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ ట్యాంక్ నుంచి జయశంకర్ కాలనీతో పాటు సీసీఐ కాలనీకి నీటి సరఫరా అవుతుంది. శనివారం రాత్రి పంచాయతీ కార్మికుడు ట్యాంకులో పడి మృతి చెందాడు. మృతదేహం నిల్వ ఉన్న నీరు ఆదివారం ఉదయం సరఫరా కావడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావును వివరణ కోరగా.. ట్యాంక్‌ను శుభ్రం చేయించామన్నారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

2 నిమిషాలకో మెట్రో!

- వేసవి రద్దీ దృష్ట్యా త్వరలో ట్రిప్పుల పెంపు
- రష్ కారిడార్‌లపై అధికారుల కసరత్తు
- ప్రస్తుతం రోజుకు 5 లక్షలకుపైగా ప్రయాణికులు
- ఏప్రిల్, మే నాటికి భారీగా పెరిగే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: రోజు రోజుకూ మెట్రో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నగర వాసులు మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 5.05 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తుండగా వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ప్రయాణికుల రద్దీ 5.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో జనం కిక్కిరిసి ప్రయాణిస్తుండగా ఏప్రిల్ నాటికి పరిస్థితి మరింత ఇబ్బందిగా మారనుంది. మెట్రోల్లో కనీసం నిల్చుని ప్రయాణం చేసేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొంది, ప్రతి మెట్రోస్టేషన్‌లో ఇప్పటికే కనీసం రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు ప్రతి ట్రిప్పు కోసం పడిగాపులు కాస్తున్నారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసే అవకాశం లేకపోయినా అదనపు ట్రిప్పులను పెంచేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ చర్యలు చేపడుతోంది.

త్వరలో 1,500 ట్రిప్పులు..

ప్రస్తుతం ప్రతి 3 నుంచి 5 నిమిషాలకు ఒకటి చొప్పున నడుస్తుండగా.. రద్దీ వేళల్లో ప్రతి 2 నిమిషాలకు ఒక మెట్రో చొప్పున అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 1,065 ట్రిప్పులు తిరుగుతుండగా త్వరలో రోజుకు 1,500 ట్రిప్పులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ట్రిప్పుల పెంపుపై కసరత్తు చేపట్టనున్నారు. నాగోల్- రాయదుర్గం, ఎల్‌బీనగర్- మియాపూర్ కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ముఖ్యంగా సికింద్రాబాద్, తార్నాక తదితర ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌లకు రాకపోకలు సాగించే ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని షటిల్స్‌ను నడిపేందుకు సైతం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కొత్త కోచ్‌లు లేనట్లేనా..

ప్రయాణికుల రద్దీ మేరకు మెట్రో సర్వీసులను ఇప్పుడున్న 3 కోచ్‌ల నుంచి 6 కోచ్‌లకు పెంచేందుకు ఏడాది క్రితమే ప్రణాళికలను రూపొందించారు. మహారాష్ట్రలోని నాగపూర్ మెట్రో నుంచి మెట్రో కోచ్‌లను తెప్పించనున్నట్లు ప్రతిపాదించారు. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ అధికారులు సైతం కొత్త కోచ్‌లను తెప్పించనున్నట్లు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి పురోగతి లేదు. మరోవైపు ఎప్పటి వరకు వచ్చే అవకాశం ఉందనే విషయంలోనూ స్పష్టత లేకుండాపోయింది. మరోవైపు నగరంలో మెట్రోలను తీవ్రమైన నష్టాల్లో నడుపుతున్నట్లు చెబుతున్న ఎల్ అండ్‌టీ కొత్త కోచ్‌లను ప్రవేశపెట్టేందుకు సంసిద్ధంగా ఉందా? అనే అంశం కూడా సందేహాస్పదమే. – రాయదుర్గం- నాగోల్, ఎల్‌బీనగర్- మియాపూర్ రూట్‌లలో నడిచే రైళ్లు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ మేరకు మెట్రోలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఐటీ కారిడార్‌లలో పని చేసే ఉద్యోగులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాధారణంగా రద్దీ కారణంగా ఒక రైలు ఎక్కలేకపోయిన వాళ్లు మరో ట్రైన్ కోసం ధీమాగా ఎదురు చూస్తారు. కానీ ఆ తర్వాత వచ్చే రెండు రైళ్లు కూడా కిక్కిరిసి ఉండడంతో మెట్రో ప్రయాణం ప్రయాసగా మారుతోంది. ఈ క్రమంలో కొత్త కోచ్‌లు అందుబాటులోకి రాకపోయినా కనీసం ట్రిప్పులను పెంచేందుకు చర్యలు తీసుకోవడం ప్రయాణికులకు కొంత మేరకు ఊరట కలిగించనుంది.

హెచ్‌ఎండీఏలోకి మోమిన్‌పేట గ్రామాలు



హెచ్‌ఎండీఏ పరిధిలోకి వెళ్లనున్న చీమల్‌దరి గ్రామం

అభివృద్ధి వేగవంతం అవుతుందని స్థానికుల సంబురం

మోమిన్‌పేట: హెచ్‌ఎండీఏ పరిధిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఆర్ఆర్ఆర్ వెంబడి రెండు కిలోమీటర్ల పరిధిలోపు ఉన్న గ్రామాలను హెచ్‌ఎండీఏ ఆధీనంలోకి తేనున్నారు. ఈ క్రమంలో మోమిన్‌పేట పరిధిలోని చీమల్‌దరి, దేవరంపల్లి, చక్రంపల్లి, బాల్‌రెడ్డిగూడెం గ్రామ పంచాయతీలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తున్నాయి. దీంతో డీటీపీసీ పరిధి నుంచి లేఅవుట్లు హెచ్‌ఎండీఏ పరిధిలోని వెళ్లనున్నాయి. గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు అదనంగా రానున్నాయి. దీంతో రైతుల భూములు మరింత పెరగనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

80 శాతం అమ్ముకున్న భూములు

ఈ నాలుగు గ్రామ పంచాయతీలలో రెండు సంవత్సరాల క్రితమే 80శాతం వరకు భూములను రైతులు అమ్ముకున్నారు. అప్పట్లోనే ఎకరా రూ.కోట్లల్లో పలికింది. ప్రస్తుతం రియల్ నేల చూపులు చూడటంతో అమ్మకాల, కొనుగోలులు నిలిచిపోయాయి. రైతుల వద్ద కేవలం 20శాతం భూమి మాత్రమే మిగిలి ఉంది. హెచ్‌ఎండీఏ పరిధిలోకి వస్తే భూములు ధరలు పెరగనున్నాయని స్థిరాస్తి వ్యాపారులు పేర్కొంటున్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్ కోరారు. ప్రమాణస్వీకార మహోత్సవ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హాజరవుతారని చెప్పారు. తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు కార్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, పాల్గొన్నారు.

పన్ను వసూలుపై ఆగ్రహం



బిల్ కలెక్టర్ల సమావేశంలో మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్

- బిల్ కలెక్టర్లు ఏం చేస్తున్నారు?
- సమీక్ష సమావేశంలో మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మండిపాటు

తాండూరు: మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నుల వసూలు కోసమే బిల్ కలెక్టర్లు ఉన్నారని, కానీ వారు విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం ఏంటని మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విక్రంసింహారెడ్డితో కలిసి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడాది కాలంగా పన్నులు వసూలు చేసే అవకాశం ఉన్నా ఎందుకు వసూలు చేయలేదని ప్రశ్నించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సీరియస్ అయ్యారు. ఈ ఏడాది మున్సిపాలిటీలో కేవలం 33 శాతమే వసూలు చేయడం దారుణమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 100 శాతం పన్ను వసూలు చేయాలని హెచ్చరించారు. అనంతరం సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు దుకాణ సముదాయాలకు వెళ్లి పన్నులను వసూలు చేశారు.

క్లుప్తంగా

నేడు కరన్‌కోట్‌కు ఎస్పీ రాక

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ సమీపంలో ఉన్న కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు సోమవారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి వస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు మండలంలోని గౌతపూర్ నుంచి కోత్లాపూర్, గౌతపూర్ చౌరస్తా నుంచి ఓగిపూర్ వరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభిస్తారని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దోమ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని మైలారం గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలంతా భక్తిభావంతో మెలగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ విడుదల

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్



సిమెంట్ మెటీరియల్‌ను డీలర్‌కు అందజేస్తున్న సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్

అనంతగిరి: తెలంగాణ రాష్ట్రంలో భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెటింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను ఆదివారం విడుదల చేశారు. వికారాబాద్‌లోని శ్రీగురుకృపా ఏజెన్సీస్ డీలర్ షాప్‌లో నిర్వహించిన తాపీ మేస్త్రీల సమావేశంలో సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సామ్రాట్ ప్రసంగించారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో బ్రిడ్జిలు, పిల్లర్లు, స్లాబ్‌లు, రహదారులకు సరైన ఎంపికవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడతారని ఆయన సూచించారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌లకన్నా కేవలం రూ. 20 ఎక్కువ ఉంటుందని, నాణ్యతను దృష్టిలో పెట్టుకుని ఆలోచించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ జగదీశ్, భారతి సిమెంట్ టెక్నికల్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



మధు(ఫైల్)

ఇబ్రహీంపట్నం: కనిపించకుండా పోయిన యువకుడి మృతదేహం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో లభ్యమైంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం .. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సింగారం మధు(24), శుక్రవారం నుంచి కనిపించకుండా పోయాడు. అతని ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద కుటుంబీకులు ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో తండ్రి జ్ఞానేశ్వర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం స్థానిక పెద్ద చెరువు తూము వద్ద మధు చెప్పులు, పర్సు, ఐడీ కార్డు, సెల్‌ఫోన్‌ను స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. డీఆర్‌ఎఫ్ బృందం చెరువులో గాలించి మధు మృతదేహాన్ని వెలికితీశారు. అవివాహితుడైన యువకుడి మరణానికి కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృతుడు రెండు నెలలుగా విధులకు హాజరు కావడంలేదని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



స్వామివారి పల్లకీ సేవలో భక్తులు



శ్రీజగద్గురు నిరంజన మఠంలో భజనలు చేస్తున్న భజన మండలి సభ్యులు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన వీరశైవ సమాజం భక్తులు
- స్వామివారి సేవలో పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీనిరంజన మఠంలో ఆదివారం వీరశైవ సమాజం భక్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు మఠం మల్లికార్జున స్వామి, గడ్డం చంద్రశేఖర్‌స్వామి, మఠం విజయకుమార స్వామిలు వీరశైవ సమాజం సభ్యులచే ఆరాధనోత్సవాల్లో భాగంగా శ్రీస్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, గంధం, సుగంధ ద్రవ్యాలతో బసవలింగేశ్వర స్వామివారికి అత్యంత వైభవంగా నమక చమక అధ్యాయాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. బిల్వాష్టకం, శివాష్టకం, అష్టోత్తర శతనామావళితో పూజలు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలను సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనిరంజన మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామి వారికి వీరశైవ సమాజం భక్తులు పాదపూజ చేశారు. నిరంజన మఠంలో బసవలింగేశ్వర స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీ సేవ ముందు భక్తులు ఖడ్గాలు వేస్తూ స్వామివారిని స్మరించుకున్నారు. పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తూ ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ గురునాథ్‌రెడ్డి శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠాధిపతులు శ్రీజగద్గురు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామివారు రాష్ట్ర పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్ గురునాథ్‌రెడ్డిని సన్మానించారు. పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయ భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు కొవూరు విజయవర్ధన్, సమా జం సభ్యులు బిఆర్ విజయ కుమార్, గంతల సంఘమేశ్వర్, బాలప్రకాశ్, తారాపురం రవి, గంటి సర్వేష్, రాకేష్, నాగభూషణం పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం: సిద్ధలింగ మహాస్వామి



మాట్లాడుతున్న సిద్ధలింగ మహాస్వామి

ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతన కోసం కేటాయించాలని, మనసుకు ప్రశాంతత చేకూరుతుందని శ్రీజగద్గురు నిరంజన మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో స్వామివారి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ప్రవచనాలు అందించారు. ప్రతిఒక్కరూ భక్తి, ధ్యానం, భగవత్ చింతన అలవర్చుకుంటే ఆరోగ్యంగా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. భక్తితో దేన్నైనా సాధించొచ్చన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ, ధర్మాన్ని పరిరక్షిస్తూ సమాజ అభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు. నిర్మలమైన మనసుతో భగవంతుడిని ఆరాధిస్తే శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో బసవలింగేశ్వర స్వామి

నిశ్చితార్థం రద్దు చేయించి..

- పెళ్లిచేసుకుంటానని మోసం చేసిన ప్రేమికుడు
- యువకుడి ఇంటి ఎదుట ధర్నా, అట్రాసిటీ కేసు నమోదు



పూర్ణేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: ప్రేమించానని ఏడేళ్లుగా వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, యువతి నిశ్చితార్థాన్ని సైతం రద్దు చేయించాడు. ఆపై ముఖం చాటేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధిత యువతి, మహిళా సంఘాల సహాయంతో కుటుంబ సభ్యులతో కలిసి యువకుడి ఇంటి ఎదుట ధర్నా చేశారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన ఓ యువతి(28)ని మీర్‌పేట ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీకి చెందిన పూర్ణేశ్వర్‌రెడ్డి(28) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని గతంలో ఆమె నిశ్చితార్థాన్ని రద్దు చేయించాడు. ఆమెతో చనువుగా ఉంటూ.. ఇంట్లో వారికి, బంధువులకు పరిచయం చేశాడు. కానీ ఆ తరువాత యువకుడికి గుట్టుచప్పుడు కాకుండా.. మరో యువతితో పెళ్లి చూపులు జరిగాయి. విషయం తెలుసుకున్న యువతి నిలదీయడంతో కులం వేరు కావడంతో మా ఇంట్లో ఒప్పుకోవడం లేదని సమాధానం చెప్పాడు. దీంతో సదరు యువతి న్యాయం చేయాలంటూ ఆదివారం పూర్ణేశ్వర్‌రెడ్డి ఇంటి ఎదుట బంధువులతో కలిసి ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు.. యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

స్వయం సేవకులు పెరగాలి



మాట్లాడుతున్న సూర్యనారాయణ మూర్తి

ఆర్‌ఎస్‌ఎస్ వక్తి, విభాగ్ సహకార్యవాహ సూర్యనారాయణ మూర్తి

పరిగి: స్వయం సేవకుల సంఖ్య పెరగాలని ఆర్‌ఎస్‌ఎస్ వక్తి, విభాగ్ సహకార్య వాహ సూర్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం పరిగి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో పరిగి ఖండ సంఘ్ చాలక్ కె.బ్రహ్మయ్య ఆధ్వర్యంలో మాధవ శాఖ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్‌తోనే వ్యక్తి పరివర్తన సాధ్యమవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా శాఖ కార్యక్రమాల ద్వారా హిందూ సమాజంలో సమరసత, అనుశాసనం, శీల నిర్మాణం జరుగుతుందన్నారు. స్వయం సేవకుల ద్వారా నిర్వహించబడే వేలాది విద్యాలయాలు, అన్ని క్షేత్రాల్లోని లక్షలాది సేవా కార్యక్రమాలు నడుస్తున్నాయని చెప్పారు. దీంతో సంఘం పట్ల సంపూర్ణ సమాజం యొక్క విశ్వసం పెరుగుతుందని తెలిపారు. స్వయం సేవకుల సంఖ్య పెరిగే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై కూలిన మర్రిచెట్లు

తప్పిన ప్రమాదం, ట్రాఫిక్ అంతరాయం



జేసీబీతో చెట్లను తొలగింపజేస్తున్న పోలీసులు

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై రెండు చోట్ల ప్రమాదవశాత్తు రెండు మర్రిచెట్లు విరిగి పడ్డాయి. ఈ సంఘటనలు చేవెళ్ల మండలం ఖానాపూర్ బస్టేజీ సమీపంలో ఒకటి, ఆలూరు బస్టేజీ సమీపంలో మరొకటి చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం స్వల్ప వ్యవధిలో రెండు చోట్ల చెట్లు కూలిపోయాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎలాంటి వాహనాలు పరుగు తీయకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మరోమార్గం లేకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్‌ఐ శంకరయ్య, ఏఎస్‌ఐ చందర్‌నాయక్‌లు సిబ్బంది, స్థానికుల సహాయంతో జేసీబీతో చెట్లను పక్కకు తొలగించి, ట్రాఫిక్ క్లియర్ చేయించారు. ఈ మర్రి చెట్లు మొదళ్లు కాలిపోయి ఉండటంతో గాలి వీచిన సమయంలో ఇలా రోడ్డుపై పడిపోతున్నాయని, వాహనదారులు చెట్ల కింద ప్రయాణం చేసే సమయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలని పోలీసులు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరి ఆత్మహత్య

మొయినాబాద్: ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెదిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ ఠాణా పరిధి చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరుకు చెందిన ముంజగళ్ల మహేశ్(29) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఎలాంటి పనిచేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, రాత్రి 8.30 గంటలకు తిరిగి వచ్చాడు. అతని భార్య నవనీత బయటకు వెళ్లి తిరిగొచ్చేసరికి గది తలుపులు మూసి ఉన్నాయి. ఎంతకీ తీయకపోవడంతో.. చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అప్పటికే చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. పరిశీలించగా మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మీర్‌పేట డ్రైవర్..

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం కస్తూరికాలనీలో నివాసముండే లోగిట్ల మధుసూదన్(35) వృత్తిరిత్యా కారు డ్రైవర్. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మధుసూదన్ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బావ సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గంజాయి గ్యాంగ్ అరెస్ట్

నిజాంపేట్ : గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను బాచుపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రగతినగర్ మిథిలానగర్‌లోని ఏపీజే అబ్దుల్ కలాం జీహెచ్‌ఎంసీ పార్క్‌లో శనివారం కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బాచుపల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి వెళ్లగా అనుమానాస్పదంగా తారసపడిన ఐదుగురు యువకులు కంభం వేణుగోపాల్ రెడ్డి, అరవల్లి దుర్గాప్రసాద్, జరపాల ప్రశాంత్ నాయక్, కసిన తనుజ్ నాగ కుమార్, కొంగర సాయిబాలాజీలను అదుపులోకి తీసుకున్నారు. వారికి పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లుగా తేలింది. వారి వద్ద మిగిలిన 60 గ్రాముల గంజాయి, స్కూటీ, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యూట్యూబర్ హర్షసాయిపై కేసు నమోదు

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మాధ్యమాలలో ఇన్‌ఫ్లూయెన్సర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సైబరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు. ఫాలోవర్లను ప్రభావితం చేసేలా అక్రమ వ్యాపార కార్యకలాపాలను ప్రమోట్ చేయకూడదని హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాజాగా పలు సామాజిక మాధ్యమాలలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు యూట్యూబర్ హర్షసాయిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ రెస్టారెంట్‌లో హెల్పర్‌గా పనిచేసే బాధితుడు 2022 నుంచి హర్షసాయి ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ ఛానల్‌ను ఫాలో అవుతున్నాడు. ఈక్రమంలో తాజాగా హర్ష తన ఇన్‌స్టాగామ్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ వెబ్‌సైట్ లింక్‌లను పోస్ట్ చేశాడు. రూ.20 వేలు డిపాజిట్ చేస్తే 150 శాతం బోనస్ వస్తుందని కంటెంట్ షేర్ చేశాడు. ఇది చూసిన బాధితుడు హర్ష షేర్ చేసిన లింక్‌ల ద్వారా ఏడాది కాలంలో రూ.13 లక్షలు బెట్టింగ్ యాప్స్‌లలో పెట్టుబడులు పెట్టి, నష్టపోయాడు. 'హర్షసాయి టిప్స్' పేరుతో టెలిగ్రాం గ్రూప్‌లో జాయిన్ కావాలని హర్ష సూచించాడని, అందులో బెట్టింగ్‌లలో సలహాలు ఇస్తుండేవాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. హర్షసాయి సలహా మేరకు ఏడాది కాలంలో రూ.13,67,300 డిపాజిట్లు చేశానని, ఆ మొత్తం నష్టపోయానని ఆరోపించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు హర్షసాయిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) చట్టం సెక్షన్ 318 (4), ఐటీ యాక్ట్ సెక్షన్ 66–డీ కింద కేసులు నమోదు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికార పార్టీలో వర్గ పోరు

తాండూరు రూరల్: అధికార కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు బయట పడ్డాయి. మండలంలో చెన్‌గేస్‌పూర్, కొనాపూర్ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు గ్రూప్‌లుగా ఏర్పడ్డారు. ఇరు గ్రామాలకు ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ దక్కించుకొనే క్రమంలో ఇరువర్గాలకు ఘర్షణ తలెత్తింది. కొంత కాలంగా కొనసాగుతున్న వివాదం ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరింది. దీంతో ఇరువురిని సముదాయించినట్లు ఎమ్మెల్యే క్యాంపు వర్గాలు తెలిపాయి.

మత్తు మందు విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

శంషాబాద్ రూరల్: పట్టణంలోని ఆర్బీనగర్ కాలనీలో మత్తు మందు విక్రయిస్తున్న యువకుడిని శనివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సంజయ్ తోటర్(24) డ్రగ్స్ తీసుకోవడంతో పాటు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు నిఘా వేశారు. గణేష్ థియేటర్ వద్ద అతడిని పట్టుకుని తనిఖీ చేశారు. 13 గ్రాముల ఎండీఎం మత్తు మందు లభించింది. దీని విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

అత్తాపూర్: టీ తాగేందుకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ చోటుమియా(61) ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 10గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న హోటల్‌లో టీ తాగి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అతడి కుమారుడు మహమ్మద్ నజీర్ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలోని పోచమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్, సీనియర్ నాయకులు టి.ప్రేమ్‌గౌడ్, కాశీగారి యాదగిరి, మునుగపాటి వెంకటేష్, రుద్ర, శివ, బాలస్వామి, వెంకటేష్, వై.రాజు, సీతారామ్, మహిపాల్, పొట్టెల్లి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లింకురోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి



గ్రామ సమస్యలపై మాట్లాడుతున్న చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న రేగడిఘనాపూర్–చనువెళ్లి లింక్‌రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు రఘువీర్‌రెడ్డి కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ఆదివారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఆయనను గ్రామ నాయకులు కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గ్రామం నుంచి చనువెళ్లి లింక్‌రోడ్డుకు మంత్రిగా ఉన్న సమయంలో రూ.80లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆ పనులు ఆలస్యమవుతున్నాయని గ్రామస్తులు ఆయనకు తెలిపారు. వెంటనే ఆయన పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ రోడ్డుపై ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన నిధులు రిజెక్ట్ అయ్యాయని, మరోసారి ప్రతిపాదనలు పంపాలని చెప్పినట్లు తెలిపారు. దీంతో ఆయన స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మాట్లాడి మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి ఈ ప్రాంతంలో ఇలా మిగిలిపోయిన బ్రిడ్జిలకు సంబంధించి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య తదితరులు ఉన్నారు.


హామీల అమలులో ప్రభుత్వం విఫలం



రాఘవేందర్‌యాదవ్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్‌ఎస్ యువజన విభాగం డివిజన్ అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్‌యాదవ్ అన్నారు. శివాజీ చౌక్ సర్కిల్ వద్ద ఆదివారం కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15 నెలలు కావస్తున్న కూడా అభివృద్ధిపై దృష్టి సాధించకపోవడం సిగ్గుచేటన్నారు. సచివాలయం ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి



ఆశ్రమంలో భోజనం అందజేస్తున్న మానవ సేవే మాధవ సేవా సంస్థ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: అనాథలు, వృద్ధులు, మానసిక దివ్యాంగులకు తోడ్పాటు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని మానవ సేవే మాధవ సేవా సంస్థ చైర్మన్ ఏర్వ కుమారస్వామి అన్నారు. ఆదివారం మేడిపల్లిలో గల అమ్మ ఆసరా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన ఆశ్రమ నిర్వాహకులు మేఘన్, విజయలక్ష్మి, శివలను సంస్థ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ.. సమాజంలో సేవ చేయడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కొంపల్లి జగదీష్, గొంత్యాల శ్రీనివాస్, దినేష్, హేమలత, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దీక్షకు బీఆర్‌ఎస్ సంఘీభావం



ఎమ్మార్పీఎస్ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్: మాదిగల రిజర్వేషన్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం శంషాబాద్ బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ రావు దీక్షాస్థలికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల రిజర్వేషన్ల పట్ల దోబూచూలాడుతోందని విమర్శించారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించకుండా కొన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, జయమ్మ, కె.శ్రీనివాస్, రాజేందర్, అశోక్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.